జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త
తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి వెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శుక్రవారం | 28-06-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 57 పేజీలు: 4 వెల : రూ.7



# సిక్కోలు గడ్డ.. గంజాయి అడ్డా!



గంజాయి విక్రయిస్తున్న షాపు

*** నగరంలోని పలు బడ్డీల్లో గంజాయి ప్యాకెట్లు విక్రయం * ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ సమీపంలోనే అమ్మకాలు * కొందరి కనుసన్నల్లోనే గుట్టుగా ఈ దందా * పెట్రేగిపోతున్న గంజాయి బ్యాచ్‌లు * దాడులు చేయడంలో పోలీసులు విఫలం * ఉక్కుపాదం మోపాలన్న ఎస్పీ ఆదేశాలు బేఖాతర్**

**శ్రీకాకుళం క్రైం, జూన్ 27 (వార్త):** ఒడిశా నుంచి శ్రీకాకుళం మీదుగా ఇతర రాష్ట్రాలకు గంజాయి తరలిపోతోంది. రైళ్లు, బస్సులు, ఇతరత్రా వాహనాలు ద్వారా దాటిపోతోంది. స్థానిక, రైల్వే పోలీసులు దాడులు చేస్తుండడంతో కొందరు పట్టుబడుతుండగా, మరికొందరు తప్పించుకుంటున్నారు. ఇప్పటి వరకూ గంజాయి తరలించే వారు తప్ప.. దీని వెనుక ఉన్న పెద్ద మనుషులు పట్టుబడిన దాఖలాలు లేవు. శ్రీకాకుళం జిల్లా ఆంధ్రా, ఒడిశా ప్రాంతం కావడంతో ఒకవైపు గుణుపురం, మరోవైపు పర్లాకిమిడి, ఇంకోవైపు బరంపురం ప్రాంతాల మీదుగా ఈ జిల్లాలోని సరిహద్దు గ్రామాల నుంచి గంజాయి తరలివస్తోంది. చెక్‌పోస్టులు ఉన్నా అక్కడి వారి కన్నుగప్పి లేకుంటే మేనేజ్ చేసి ఇతర ప్రాంతాలకు గంజాయిని ఈ ముఠా తరలించేస్తున్నారు.

## వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో..

శ్రీకాకుళం నగరంలోని ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు కూతవేట దూరంలో మార్కెట్‌కు ఆనుకుని పలు బడ్డీల్లో గుట్టుగా గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్లలో విక్రయిస్తున్నారు. ఆ షాపులో ఓ బాక్సులో వీటిని ఉంచి ఎవరైనా అడిగితే కాగితపు పొట్లాల రూపంలో అమ్ముతున్నారు. కొత్త వ్యక్తులకు వీటిని విక్రయించడం లేదు. తెలిసిన వారికే ఇస్తున్నారు. గంజాయి విక్రయం విషయం బడ్డీల యజమానులకు అడిగితే పూజల కోసం భక్తులు వీటిని కొనుగోలు చేస్తున్నారని చెబుతున్నారు. వీరికి ఎక్కడి నుంచి వస్తుంది.. ఎవరు అమ్ముతున్నారన్న దానిపై మౌనమే సమాధానం. పోలీస్‌స్టేషన్ పక్కనే బడ్డీ ఉంది కదా.. ఎలా విక్రయిస్తున్నావని అడిగితే ఏం కాదులే అన్న జవాబు వారి నుంచి వస్తుండడం గమనార్హం. నగరంలోని పలు ప్రాంతాల్లో గంజాయి వ్యాపారం దందా యథేచ్ఛగా సాగుతోంది. ఎస్ఐగా గణేష్ ఉన్న సమయంలో గంజాయి బ్యాచ్‌లను గుర్తించి వారందరికీ గట్టి వార్నింగ్ ఇవ్వడంతో నగరంలోని పలు ప్రాంతాల్లో కొంతమేర ఈ దందా తగ్గింది. ఆయనకు బదిలీ కావడంతో మళ్లీ ఈ వ్యాపారం పుంజుకుంది.

## గంజాయి బ్యాచ్‌లకు ముందస్తు సమాచారం..

గంజాయి విక్రయంతో మంచి ఆదాయం పొందుతున్న కొందరు గుట్టుచప్పుడుగా ఈ దందా నడుపుతున్నారు. ఎవరికీ అనుమానం రాకుండా వీటిని తమకు తెలిసిన వారి ద్వారానే వ్యాపారం సాగిస్తున్నారు. ఒడిశా నుంచి గంజాయి తెప్పించుకుని చిన్నచిన్న ప్యాకెట్లుగా చేసి బడ్డీలకు అమ్మకాలు చేస్తున్నారు. అసలు వ్యక్తులు బయటకు రాకుండా అనుచరుల ద్వారా ఈ దందా గుట్టుగా కొనసాగిస్తున్నారు. ఒకవేళ వారు పోలీసులకు పట్టుబడితే తమ పేర్లు బయటకు రాకుండా చూసుకుంటున్నారు.

## పోలీసుల వైఫల్యం..

కొందరు పోలీసులకు ఈ గంజాయి దందా కాసులు కురిపిస్తోందన్న విమర్శలు ఉన్నాయి. అందుకే వారు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని ఈ వ్యాపారం చేస్తున్న వారే బహిరంగంగానే చెబుతున్నారు. జిల్లా పోలీసు ఉన్నతాధికారులు గంజాయి రవాణా, విక్రయంపై ఉక్కుపాదం మోపాలని పోలీసు సిబ్బందికి ఆదేశాలిస్తున్నా వారు పట్టించుకోవడం లేదు. జిల్లా పోలీసు ఉన్నతాధికారులు ఇకనైనా ఇంటిదొంగల పని పడితే తప్ప గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు తగ్గుముఖం పట్టవని కొందరు చెబుతున్నారు.



## ఎస్పీ ఆదేశాలు బేఖాతర్

**గంజాయిపై ఉక్కుపాదం మోపండి.. జిల్లాలో ఎక్కడా కూడా గంజాయి అమ్మకాలు, తరలింపు జరగకుండా చూడండి.. నిఘా మరింత పెంచి కట్టడి చేయండి.. ఈ దందా వెనుక ఎంతటివారు ఉన్నా వదలొద్దు.. నగరంలో గంజాయి బ్యాచ్‌లపై కేసులు పెట్టండి.. ఈ దందాకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోండని జిల్లా ఎస్పీ జీఆర్ రాధిక పోలీసులకు ఆదేశాలిస్తున్నా.. కొందరు బేఖాతర్ చేస్తున్నారు. మాదకద్రవ్యాల నిరోధానికి ఎస్పీ అవగాహన కల్పిస్తున్నారు. ఇటీవల సైకిల్ ర్యాలీ చేశారు. ఇలా అనేక కార్యక్రమాలు చేస్తున్నారు. సమీక్షా సమావేశాల్లోనూ ఇదే విషయం గట్టిగానే చెబుతున్నారు.. అయినా కొందరు కాసులకు కక్కుర్తి పడి పట్టించుకోవడం లేదు.**

## ఆదిత్యుని సన్నిధిలో చాగంటి దంపతులు



**అరసవల్లి, జూన్27 (వార్త):** ఆరోగ్య ప్రదాత సూర్యనారాయణ స్వామిని గురువారం ఆధ్యాత్మిక ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తొలుత చాగంటి కోటేశ్వరరావును ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికారు. తదుపరి ఆలయ అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వదించారు. వారికి స్వామి వారి జ్ఞాపికను ఆలయ జూనియర్ అసిస్టెంట్ బీఎస్ చక్రవర్తి అందజేశారు. అలాగే స్వామి వారి ప్రసాదాన్ని అందించారు.

# అలుపెరగని అచ్చన్న శ్రామికుడు..

# శేషు



**రాష్ట్రంలో అత్యంత కీలకమైన టెక్కలి నియోజకవర్గంలో టెక్కలి మండలంలోని తెలుగుదేశం పార్టీని ముందుకు నడిపించడంలో మండల పార్టీ అధ్యక్షుడు బగాది శేషగిరిరావు చేసిన కృషి అభినందనీయం. ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ టిడిపి విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ కింజరాపుల మాట జవదాటకుండా తెలుగుదేశం పార్టీ జెండాను టెక్కలి నియోజకవర్గంలో ఎగుర వేయడమే లక్ష్యంగా అహర్నిశలు శ్రమించిన వ్యక్తి బగాది శేషగిరి. ఈ నియోజకవర్గం కింజరాపు కోట అయినప్పటికీ టెక్కలి మండలం మాత్రం ఎప్పుడు కూడా తెలుగుదేశం పార్టీ ఓటింగ్ పరంగా వెనుక పడుతూనే ఉంది. కింజరాపు కుటుంబానికి విధేయుడుగా ఉంటూ ఎన్నో కష్టనష్టాలు ఓర్చుకుంటూ కేసులు పెట్టిన బెదరక మండలంలో తెలుగుదేశం పార్టీ మెజార్టీ సాధించే దిశగా అడుగులు వేసిన బగాది శేషగిరిరావు రాజకీయ ప్రయాణంపై వార్త ప్రత్యేక కథనం.**

(టెక్కలి -వార్త)

* అచ్చన్న కష్టంలో తోడై... విజయానికి సైనికుడై..
* మైనస్ ఓట్ల నుంచి మెజార్టీ సాధించేవరకు..
* రౌడీ షీట్ తెరిచిన వెనుకకు తగ్గని వైనం
* కీలక నామినేటెడ్ పోస్ట్ వచ్చే అవకాశం
* అచ్చన్న మదిలో ఏముందో...

టెక్కలి మండలం రాధా వల్లభాపురం పంచాయతీకి చెందిన బగాది శేషగిరిరావు 2006 సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీ యువ కార్యకర్తగా రాజకీయ రంగ ప్రవేశం చేశారు. అనంతరం జిల్లా యువజన కాంగ్రెస్ జనరల్ సెక్రె టరీగా పనిచేస్తూ దువ్వాడ శ్రీనివాస్‌తో అత్యంత సన్నిహిత సంబంధాలు కలిగి ఉండేవాడు. దువ్వాడ శ్రీనివాస్ నియోజకవర్గంలో పాదయాత్ర చేసినప్పుడు కూడా ఆ పాదయాత్రలో బగాది శేషు కీలకపాత్ర వహించారు. దువ్వాడ శ్రీనివాస్ ప్రజారాజ్యం పార్టీలో ఎమ్మెల్యేగా పోటీ చేసేటప్పుడు కూడా బాగాది అహర్నిశలు శ్రమిస్తూ మంచి నేతగా గుర్తింపు తెచ్చుకున్నాడు. అప్పుడు రాజకీయంగా జరిగిన పరిణామంలో దువ్వాడ శ్రీనివాస్ తెలుగుదేశం పార్టీలో చేరారు. అతనితో పాటు బగాది కూడా చేరారు అయితే కొద్ది రోజులకే దువ్వాడ శ్రీనివాస్ టిడిపి నుంచి బయటికి వెళ్లిపోయారు. అప్పటికే అచ్చం నాయుడుతో ఏర్పడిన సంబంధంతో అతనికి ఉన్న నాయకత్వ లక్షణాలకు ఆకర్షితుడైన శేషగిరిరావు తెలుగుదేశం పార్టీలోనే ఉండిపోయారు. ఆ తరువాత జరిగిన ఎన్నికల్లో టెక్కలి జడ్పిటిసిగా కూడా పోటీ చేసి గట్టి పోటీనే ఇచ్చారు. అప్పటి నుంచి టెక్కలి మండలంలో తెలుగుదేశం పార్టీని ముందుకు నడిపించే దిశగా 2017లో మండల పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. ఆనాటి నుంచి ఇప్పటివరకు కూడా మండల పార్టీ అధ్యక్షుడిగా కొనసాగుతూ ఉన్నాడు. 2014, 2019, 2024 అసెంబ్లీ ఎన్నికలకు తానే జనరల్ ఏజెంట్గా వ్యవహరిస్తూ తెలుగుదేశంపార్టీకి వెన్ను ముకగా నిలిచాడు.





### మైనస్ నుంచి మెజార్టీ వరకు..

టెక్కలి నియోజకవర్గం గత 30 సంవత్సరాలుగా కింజరాపు కోటగా ఉన్నప్పటికీ టెక్కలి మండలంలో మాత్రం ఎప్పుడు కూడా కాంగ్రెస్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హవా కొనసాగుతూనే ఉంది. 2014 తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర మంత్రిగా టెక్కలి పట్టణాన్ని కింజరాపు అచ్చినాయుడు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది అభివృద్ధి చేసినప్పటికీ అప్పటికి ఓటింగ్ పరంగా వెనుక పడుతునే వచ్చారు. 2014 ఎన్నికల్లో అచ్చం నాయుడు సుమారు 4000 ఓట్లు, 2019 ఎన్నికల్లో సుమారు 6000 ఓట్లుతో ఈ మండలంలో వెనుకబడ్డాడు. అయితే ఇటీవల జరిగిన ఎన్ని కల్లో 9200 ఓట్ల మెజార్టీని సాధించారు. దీనిని పరిశీలిస్తే మైనస్ ఓట్లు ఉన్న మండలాన్ని మెజార్టీ ఓట్లు సాధించేలా బగాది చేసిన కృషి కనబడుతూనే ఉంది.

### కేసులు పెట్టిన వెనుకకు తగ్గని బగాది..

రాష్ట్రంలో అధికారం చేపట్టిన వైఎస్ఆర్ పార్టీ గతంలో కార్యకర్తలు ఏ స్థాయిలో వేధించిందో కూడా అందరికీ తెలిసిందే. ముఖ్యంగా జగన్మోహన్ రెడ్డికి అత్యంత ప్రత్యర్థిగా మారిన కింజరాపు అచ్చం నాయుడును నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీని అణిచివేసే అనేక ప్రయత్నాలు జరిగాయి. దూకుడు మీద ఉన్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ప్రభావంతో గడప దాటడానికే భయపడుతున్న రోజుల్లో బగాది మాత్రం వెనుకకు తగ్గలేదు. ఇందులో భాగంగా బగాది శేషగిరిపై కూడా సుమారు 15 కేసులు నమోదు చేశారు. రౌడీషీట్ తెరుస్తూ మరో ఆరు షీట్లు కూడా జత చేసి భయభ్రాంతులకు గురి చేశారు. అయినప్పటికీ తాను మాత్రం తెలుగు దేశం పార్టీ జెండా విడిచిపెట్టలేదు. పార్టీ ఆదేశించిన ప్రతి కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తూ కార్యకర్తలకు అండగా నిలుస్తూ ముందుకు నడిచారు. అచ్చం నాయుడు అరెస్ట్ చేసిన తర్వాత టెక్కలిలో టిడిపి పని అయిపోయింది మరి కార్యకర్తలకు భరోసా ఇచ్చే నాథుడే లేడు అని ప్రచారం జరుగుతున్న రోజుల్లో ధైర్యంగా బగాది ముందుకెళ్లి పార్టీని సన్నద్ధం చేశారు.

### కింజరాపులకు విధేయుడుగా..

బగాది శేషగిరిరావు వ్యక్తిత్వాన్ని నిశితంగా పరిశీలిస్తే కింజరాపు అచ్చం నాయుడు, రామ్మోహన్ నాయుడుతో చాలా సన్నిహిత సంబంధాలు ఉన్నప్పటికీ చాలా సాదాసీదాగా ఉంటాడు. ఆడంబరాలకు పోకుండా పార్టీ ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతం చేయడంలో కీలకపాత్ర వహిస్తాడు. అందర్నీ ఆప్యాయంగా పలకరిస్తూ అన్నా అంటూ సంబోధిస్తూ ముందుకెళ్తుంటాడు. అందుకే నియోజకవర్గంలో కూడా బగాది శేషగిరి ని అందరూ ఆప్యాయంగా చూస్తారు. బగాది శేషు ను స్వయంగా అచ్చం నాయుడు




ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని నారా లోకేష్‌ని పరిచయం చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. మహానాడు వంటి కార్యక్రమాల్లో సైతం బగాది చురుగ్గానే పాల్గొన్నారు. ముఖ్యంగా నియోజకవర్గ కేంద్రం కావడంతో అనేక సందర్భాలలో నియోజకవర్గ స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించవలసిన పరిస్థితి ఉన్నప్పుడు ఆయా మండల పార్టీ అధ్యక్షులను సమాయత్తం చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో శేషగిరి కీలకపాత్ర వహించారు.

### బగాదికి.. నామినేటెడ్‌పై తెలుగు తమ్ముళ్ల ఆశలు

టెక్కలి మండలంలో తెలుగుదేశం పార్టీని బలోపేతం చేసి బాబాయి అబ్బాయిలకు వెన్నుముకగా నిలిచిన బగాది శేషగిరికి కీలక నామినేటెడ్ పోస్ట్ వస్తుందని తెలుగు తమ్ముళ్లు ఎదురుచూస్తున్నారు. మండలంలో ఇప్పటివరకు ప్రతిపక్షాల హవా కొనసాగడంతో సర్పంచ్ పదవి వరకే బగాది పరిమిత మయ్యారు. ఈ నేపథ్యంలో అచ్చం నాయుడు కీలకమైన పదవిని బగాదికి కట్ట బెట్టి గౌరవిస్తారనే ప్రచారం జరుగుతుంది. కేంద్ర మంత్రిగా రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రిగా అచ్చం నాయుడు బాధ్యతలు చేపట్టి త్వరలోనే టెక్కలి రానున్న నేపథ్యంలో భారీ ఎత్తున పౌర సన్మానానికి బగాది వ్యూహరచన చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అచ్చం నాయుడు మనసులో ఏముందో తెలియాలంటే మరికొద్ది రోజులు వేచి చూడవలసిందే.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## జనసేనలోకి పీజేపురం సర్పంచ్?

**వజ్రపుకొత్తూరు, జూన్ 27 (వార్త):** వజ్రపుకొత్తూరు మండలం పూడి జగన్నాధపురం పంచాయతీ సర్పంచ్ బత్తిని ప్రసాదరావు వైసీపీని వీడి జనసేన పార్టీలోకి చేరనున్నట్టు తెలిసింది. గత మూడున్నరేళ్ల కిందట నూతనంగా సర్పంచ్ పదవికి ఎన్నికై ఆ తర్వాత వైసీపీలో చేరారు. ఎన్నికల్లో వైసీపీ ఘోరంగా ఓటమి పాలవ్వడంతో జనసేనలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్టు తెలిసింది. కాగా, మంత్రి సీదిరి అప్పల రాజు ఒకానొక దశలో తనకు తగిన గుర్తింపు ఇవ్వలేదని, తమ గ్రామంలో అంగన్వాడీ ఆయా పోస్టు ఖాళీ ఏర్పడితే తనకు తెలియకుండా ప్రతి పక్ష నాయకుడికి ఇచ్చేసి తనకు అవమాన పరిచారని, అందుకే వైసీపీని వీడి జనసేన పార్టీలో చేరనున్నారని తెలిసింది. జనసేన పార్టీలోకి ఎప్పుడు చేరతారో తెలియాల్సి ఉంది.



## వృద్ధుడి దహనానికి అభయం సాయం

**టెక్కలి, జూన్ 27 (వార్త):** స్థానిక మేజర్ పంచాయతీ పరిధి తెలుకల వీధిలో నివాసం ఉంటున్న సుభాష్ కుమార్ సాహు (72) బుధవారం రాత్రి మృతి చెందాడు. దహన సంస్కారాలు చేసేందుకు ఎవరూ ముందుకురాక పోవడంతో అభయం యువజన సేవా సంఘం సభ్యులు స్పందించారు. దహన సంస్కారాలకు ఆర్థికసాయం అందించారు. అభయం యువజన సేవా సంఘం అధ్యక్షుడు దేవాది శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి, పేదలకు సాయం అందించడంలో సంఘం ముందుంటుందని తెలిపారు. కార్యక్రమంలో అభయం సేవాసంఘం సభ్యులు మున్నా, అద్దాల వీరాబద్రాచారి, జగదీష్ పొరిడ పాల్గొన్నారు.

## ఏపీ టెట్‌లో శేషాద్రికి స్టేట్ ఫస్ట్ ర్యాంక్



**పొందూరు, జూన్ 27 (వార్త):** పొందూరు మండలం తోలాపి గ్రామానికి చెందిన అన్నెపు శేషాద్రి నాయుడు 150 మార్కులతో ఆంధ్రప్రదేశ్ టెట్ ఫలితాల్లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించాడు. ఈయన తండ్రి ధర్మారావు ప్రభుత్వ ఉపాధ్యాయుడుగా ఉన్నారు. తోలాపి సర్పంచ్ రాధాకృష్ణ, ఉప సర్పంచ్ శ్రీనివాస రావు, ఎంపీటీసీ కళ్యాణి, జనసేన ఉపాధ్యక్షుడు బాల కృష్ణ, నాయకులు, గ్రామ ప్రజలు శేషాద్రి నాయుడును అభినందించారు.

## మందస అభివృద్ధికి సహకరించండి



**మందస, జూన్ 27(వార్త):** మేజరు పంచాయతీ మందసను ప్రస్తుతం సమస్యలు వేధిస్తున్నాయని, వాటి పరిష్కారానికి అధికారులు సహకరించాలని మాజీ సర్పంచ్, తెలుగుదేశం పార్టీ నాయకుడు డుంకురు తిరుపతి అన్నారు. మందస వచ్చిన జిల్లా పంచాయతీ అధికారి టి.వెంకటేశ్వరరావును గురువారం కలిసిన ఆయన సమస్యలు వివరించారు. మేజరు పంచాయతీగా గుర్తింపు పొందిన మందస పంచాయతీలో సమస్యలు కూడా మేజరుగానే ఉన్నాయన్నారు. సానుకూలంగా స్పందించి, పంచాయతీని అభివృద్ధి పథకంలోకి వెళ్లడానికి సహ కరించాలన్నారు. ప్రధానంగా మంచినీటి సమస్య, పారిశుద్ధ్యం తదితర సమ స్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. ఈ మేరకు డీపీఓ సానుకూలంగా స్పం దించినట్టు తిరుపతి చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అరసాడ రఘుపతిరావు, ఏఓ బూరగాన ఋష్యేశ్వరరావు, బమ్మిడి నవీన్ కుమార్ ఉన్నారు.

## కోనేరుకు నామినేటెడ్ పదవి?



**వజ్రపుకొత్తూరు, జూన్27 (వార్త):** రాష్ట్ర మత్స్యకార నాయకుడు, తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మండల తెలుగు యువత అధ్యక్షుడు, ప్రముఖ రచయిత కోనేరు ఆదినారాయణకు నామినేటెడ్ పదవి ఇవ్వాలని పలువురు టిడిపి నాయకులు, మత్స్యకార సంఘ ప్రతినిధులు కోరుతున్నారు. రానున్న నామినేటెడ్ పదవులు పందారంలో కోనేరుకు సముచిత స్థానం ఇవ్వాలని పలువురు ఆశా భావాన్ని వ్యక్తం చేస్తున్నారు. వజ్రపు కొత్తూరు మండలం తర్లా గడివూరు గ్రామం మత్స్యకార వర్గానికి చెందిన కోనేరు 1982 నుంచి నందమూరి తారకరామారావు నేతృత్వంలో పార్టీలో క్రియాశీలక సభ్యునిగా పనిచేశారు. ఇప్పటి వరకు పార్టీలు మారక టీడీపీకే కట్టుబడి ఉన్నారు. నాటి నుంచి నేటి వరకు మారుతున్న ఎమ్మెల్యే లకు, ఎంపీ లకు సేవలందిస్తూనే వస్తున్నారు. పార్టీ కష్ట కాలంలో కూడా వెన్నంటి ఉండి అనేక సేవలందించారు. కోనేరు కింజరాపు ఎర్రన్నాయుడుకు అత్యంత అనుచరుడు కూడా. పార్టీ కోసం తన ఎనలేని సేవలందించిన కోనేరుకు నామినేటెడ్ పదవి ఇవ్వాలని ఎమ్మెల్యే గౌతు శిరీష, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, శ్రీకాకుళం పార్లమెంట్ సభ్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు లు కోనేరుకు పార్టీ పరంగా సముచిత స్థానం ఇచ్చేందుకు సహకరించాలని పలువురు కోరుతున్నారు.

## టెక్కలికి ట్యాంకుల ద్వారా.. నీటి సరఫరా

* వ్యవసాయ శాఖ మంత్రి అచ్చం నాయుడు
* కదిలించిన 'వార్త' కథనం



**టెక్కలి, జూన్ 27 (వార్త):** టెక్కలి మేజర్ పంచాయతీ పరిధిలో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చం నాయుడు ఆర్డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. టెక్కలిలో దాహం కేకలు శీర్షికను వార్తలో ప్రచురితమైన కథనానికి మంత్రి స్పందించారు. గత పాలకులు పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా తాగునీటి సౌకర్యంపై దృష్టి పెట్టకపోవడం, వర్షాభావం వల్ల బోరువెల్స్ ఎండిపోవడం, వంశధార నీటి నిల్వ చేయడంలో వైఫల్యం, పట్టుమహాదేవి కోనేరులో గత నాలుగేళ్లగా నీరు నిలువ చేయకపోవడం తదితర అంశాలపై విశ్లేషణాత్మక ఆసక్తికర కథనాన్ని 'వార్త'లో ప్రచురితమైంది. దీనిపై

జాతీయ వార్త తెలుగు దిన పత్రిక **ఎఫెక్ట్**

స్పందించిన అచ్చన్న టెక్కలి మండల టీడీపీ అధ్యక్షుడు బగాది శేషగిరితో పాటు నాయకులు బగాది మరి, కోళ్ల లవకుమార్‌తో మాట్లాడి ప్రస్తుత పరిస్థితిపై అడిగ తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్‌తో మాట్లాడి 20 లక్షల రూపాయలు తక్షణ నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. నీటి కొరత ఉన్న ప్రాంతాలలో ట్యాంకర్ ద్వారా నీరు సరఫరా చేయాలని ఆర్డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. ఆర్డబ్ల్యూఎస్ జేఈ మోహన్ మాట్లాడుతూ టాంకర్లు సిద్ధం చేశామని నీటి కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.




# విద్యా రంగానికి అధిక ప్రోత్సాహం

* శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ * విద్యార్థులకు కిట్ల పంపిణీ

**శ్రీకాకుళం టౌన్, జూన్ 27 (వార్త):** శ్రీకా కుళం నగరంలో విద్యారంగానికి ప్రభుత్వం ప్రాధాన్య తనిస్తోందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. గురువారం ఎన్టీఆర్ నగరపాలకోన్నత పాఠశాలలో విద్యార్థులకు విద్యాకిట్లను పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ గతంలో చంద్రబాబు హయాంలోనే ప్రభుత్వ పాఠశాలలను బలోపేతమయ్యాయని, పెద్ద ఎత్తున టీచర్ల పోస్టు భర్తీ చేయడం జరిగిందన్నారు. గత అయిదేళ్ల వైసీపీ పాలనలో అనాలోచిత నిర్ణయాలతో విద్యావ్యవస్థ అస్తవ్యస్తం అయ్యిందని, నాడు నేడు కింద ప్రజాధనం వృథా అయింది తప్ప విద్యార్థులకు ప్రయోజనం కలగలేదన్నారు. గతంలో పంచాయితీరాజ్ శాఖమంత్రిగా ఎన్నో సంస్కరణలను తీసుకువచ్చిన యువనేత లోకేష్ ప్రస్తుతం విద్యాశాఖ మంత్రిగా వున్నారని, ఆయన నేతృత్వంలో విద్యారంగంలో సమూల మార్పులు రానున్నాయని తెలిపారు. కార్యక్ర మంలో జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు, ఉప విద్యాశాఖాధికారి విలియం, ఎంఈవో కృష్ణారావు, పాఠశాల పూర్వ విద్యార్థి సంఘ నాయకులు వి. జి. కె. మూర్తి, జామి భీమశంకర్, టీడీపీ నగరాధ్యక్షుడు మాదారపు వెంకటేష్, డివిజన్ ఇంచార్జి కెల్ల కొండలరావు, టీడీపీ నాయకులు, డివిజన్ ఇంచార్జిలు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



### కిష్టప్పపేటలో..

విద్యార్థులు కష్టపడి బాగా చదివి, భవిష్యత్తులో ఉన్నతమైన శిఖరాలను అధిరోహించాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ఆకాంక్షించారు. కిష్టప్పపేట మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు బలివాడ సూర్యనారాయణ అధ్యక్షతన గురువారం నిర్వహించిన కిట్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమ విద్యానందించాలి అన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అనంతరం ఎంఈఓ కృష్ణారావుతో కలసి విద్యార్థులకు కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కమిటీ అధ్యక్షురాలు బి.రోహిణి, ఇంచార్జి సర్పంచ్ అరసవల్లి సత్యవతి, టీడీపీ నాయకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



### అన్నా క్యాంటీన్‌లో వడ్డించిన ఎమ్మెల్యే

శ్రీకాకుళంనగరంలో ఏడురోడ్ల కూడలి, పాత బస్టాండ్ ప్రాంతాల్లో గత 434 రోజులుగా గొండు శంకర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నా క్యాంటీన్ నిత్యం వందలాది మంది ఆకలి తీరుస్తున్న విషయం తెలిసిందే. ప్రారంభం అయిన నాటి నుంచి నేటి వరకు అన్నా క్యాంటీన్ నిరంతరాయంగా కొనసాగుతూ నేటికీ 435 రోజులకు చేరుకుంది. చంద్రబాబు స్ఫూర్తితో తన సొంత ఖర్చుతో ఎమ్మెల్యే నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యే గా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం తొలిసారిగా గురువారం అన్నాక్యాంటీన్‌ను సందర్శించారు. అన్నార్తులకు స్వయంగా వడ్డించడంతో పాటు అయన కూడా అక్కడే అందరితో పాటు భోజనం చేశారు.

## విద్యాలయాన్ని కాపాడాలని ఎమ్మెల్యేకు వినతి

**మందస, జూన్27 (వార్త):** మందస పట్టణం లోని శ్రీరాజా శ్రీనివాస స్మారక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన ఎంతోమంది ఉన్నత స్థానాల్లో ఉన్నారు. ఈ ప్రాంతానికే చారిత్రాత్మక నిర్మాణమిది. 125 వసంతాలు పూర్తి చేసుకుంది. ఎందరో మేథావులు, విద్యాధికులు, ఇంజనీర్లు, డాక్టర్లు, న్యాయవాదులు, వ్యాపారవేత్తలను అందజేసింది. అటువంటి ఈ విద్యాల యానికి ఐకానిక్ ముందుభాగమే. మందస సంస్థానాన్ని పరిపాలించే శ్రీరాజాశ్రీనివాస మహారాజు కాలంలో నిర్మాణం చేసుకున్న ఈ పాఠశాల అప్పటి చరితను గుర్తు చేస్తోంది. ఈ ముందరి భాగం కాలక్రమేణా శిథిలావస్థకు చేరుకుంటోంది. దీంతో ఇదే పాఠశాలలో విద్యనభ్యసించి అమెరికాలో ఉంటున్న ప్రొఫెసర్ మోహనరావు ఆచారి ఆధ్వర్యంలో ఐకానిక్ కట్టడం పునఃనిర్మాణానికి ఓ వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేశారు. దాతలు, పూర్వవిద్యార్థులు. ప్రముఖులు ఉన్న ఈ గ్రూపు సభ్యులు ముందుకు వస్తున్నారు. విరాళాలు ఇస్తున్నారు. కాగా.. పాఠశాల సమస్యను పలాస ఎంఎల్ఏ గౌతు శిరీషా దృష్టికి ఎస్ఆర్ఎస్ఎం జడ్పీ హైస్కూలు ఓల్డ్ స్టుడెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు తీసుకెళ్లారు. దీనికి ఆమె స్పందించారు. తప్పక సాయం చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలకు ఎంతో ఉపయోగపడే ఈ విద్యాలయాన్ని ఎలా గైనా కాపాడుకుందామన్నారు. ప్రభుత్వం నుంచి సహాయ, సహకారాలు అందజేస్తానన్నారు. అధికారులతో ఎంఎస్ఏ శిరీషా చర్చించి, ఏ విధంగా పాఠశాల సమ స్యను పరిష్కరించాలో చర్చలు జరిపారు. సాధ్యమైనంత తొందరలోనే అధికారుల నుంచి అనుమతులు మంజూ రునకు కృషి చేస్తానని ఎంఎల్ఏ శిరీషా పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వడ్డి చంద్రశేఖరం, కొమ్మాజోస్యుల సీతారామశర్మ, శిష్టు సోమనాథ్, ప్రభాకర్పట్నాయిక్, ఇప్పిలి కేశవరావు (చిట్టి), డుంకురు తిరుపతి, సింహచలపతి, అంకం ఆనందరావు. శ్రీనివాస్పఢి తదితరులు పాల్గొన్నారు.





## ఏపీ కళింగ సంక్షేమ సంఘం మహిళా అధ్యక్షురాలిగా లీల

**శ్రీకాకుళం టౌన్, జూన్ 27 (వార్త):** ఆంధ్రప్రదేశ్ కళింగ సంక్షేమ సేవా సంఘం అధ్యక్షురాలుగా శ్రీమతి బొడ్డేపల్లి లీల నియమితులయ్యారని ఆ సంఘం మీడియా కార్యదర్శి చౌదరి లక్ష్మణరావు ఒక ప్రకటనలో తెలిపారు. తనను మహిళా అధ్యక్షురాలుగా నియమించిన అధ్యక్షుడు సీపాన వెంకటరమణకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కళింగ సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తానన్నారు.



## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**ఇచ్ఛాపురం, జూన్ 27 (వార్త):** సీజనల్ వ్యాదుల పట్ల అప్రమత్తంగా ఉండాలని 22వ వార్డు కౌన్సిలర్ కాళ్ళ దిలీప్ యాదవ్ అన్నారు. వార్డ్ లో అవగాహన కలిపిస్తు 22వ వార్డులో పర్యటించారు. కౌన్సిలర్ కాళ్ల దిలీప్ కుమార్, పారిశుధ్య కార్యదర్శి బొడ్డేపల్లి ప్రియాంక, ఏఎన్ఎమ్ కుమారి, అంగనవాడీ టీచర్లు కుండాల సురేఖ, జ్యోతి, ఆశా వర్కర్ల సప్పా సరోజ, కె.ఇందిర, రామలక్ష్మి, శోభారాణి పాల్గొన్నారు.

# ఆదాయం తప్ప.. అవస్థలు పట్టావా?

*** ఆర్టీసీ అధికారుల తీరుపై ఎమ్మెల్యే అసహనం * జలాశయంలా మారిన కాంప్లెక్స్ పరిశీలన**
*** అధికారులతో అత్యవసర సమీక్ష * దశాబ్దాల సమస్యకు చెక్ పెట్టే ప్రయత్నం**



**శ్రీకాకుళం టౌన్ జూన్27(వార్త):** చిన్నపాటి వర్షం కురిస్తే చాలు శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ జలాశయాన్ని తలపిస్తుంది. ఎక్కడి కక్కడ వర్షపు నీరుకు తోడు కాలువల్లో నీరు చేరువై కాంప్లెక్స్ ఆవరణ మొత్తం చెరువును తలపించేలా మారి ప్రయాణికులకు అవస్థలకు గురిచేస్తుంది. దశాబ్దాలుగా ఇదే పరిస్థితి నెలకొంటున్నా అటు ఆర్టీసీ అధికారులు, ఇటు పాలకులు పట్టించుకోకపోవడం ప్రయాణికుల కష్టాలకు అంతులేకుండా పోయింది. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికుల ముందు జిల్లా పరువు పోయినా, పత్రికలు, చానెళ్ళు ఘోష పెట్టినా, జిల్లా ప్రజలు మొర పెట్టినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఎట్టకేలకు ప్రజలు ఆదరించిన నాయకుడు, సామాన్యుడు, నియోజకవర్గ ప్రజలు అత్యధిక మెజారిటీతో గెలిపించిన శాసనసభ్యుడు గొండు శంకర్ తక్షణం స్పందించాడు. ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసిన కొద్దిరోజులకే.. గురువారం కురిసిన వర్షానికి జలమయమైన కాంప్లెక్స్ దుస్థితిని స్వయంగా చూసి చలించిపోయారు. తొలిసారిగా ఎమ్మెల్యే అయినా సాధారణ ప్రయాణికునిలా చెరువును తలపించే ఆర్టీసీ కాంప్లెక్స్‌లో నడుచుకుంటూ వెళ్లి ప్రయాణికులు పడుతున్న అవస్థలను చవిచూశారు. గత పాలకుల్లా అంతటితో ఆగకుండా సంబంధిత అధికారులతో అత్యవసర సమీక్షను ఏర్పాటు చేసి పరిష్కార మార్గాలపై చర్చించారు. కాంప్లెక్స్‌లో నెలకొన్న పరిస్థితులపై నిలదీశారు. ఆదాయం తప్పితే ప్రజల అవస్థలు, కష్టాలు పట్టించుకోరా అని ప్రశ్నించారు. ఇటువంటి పరిస్థితులు తలెత్తడానికి కారణాలు, పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రణాళికలు రూపొందించి ఇవ్వాలని ఆదేశించారు. సమస్యను ముఖ్యమంత్రి దృష్టిలో పెట్టి పరిష్కారానికి అవసరమైతే నిధులు మంజూరు చేయిస్తానని హామీనిచ్చారు. ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా, జిల్లా పరువును గంగ పాలు చేయకుండా అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని గొండు శంకర్ సూచించారు.

### హెరిటేజ్ పాల ఉత్పత్తుల ప్రారంభం

హెరిటేజ్ ఉత్పత్తుల పంపిణీ కేంద్ర సేవలను నగర వాసులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గొండు శంకర్ కోరారు. నగరంలో పాత బస్టాండ్ ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన హెరిటేజ్ పాల ఉత్పత్తుల కేంద్రం వెంకట దుర్గ డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన నిర్వాహకులను అభినందిస్తూ, లాభాపేక్ష లేకుండా వినియోగదారుల మన్ననలు పొంది, వ్యాపారాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సెంటర్ యజమాని సంతోష్, టీడీపీ నాయకులు, హెరిటేజ్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



## మీసేవ కేంద్రాల్లో
# యధాతధంగానే సేవలు

**ఆమదాలవలస, జూన్27 (వార్త):** గతంలో జరిగినట్లే మీసేవ కేంద్రాల్లో సేవలు యథాతథంగా కొనసాగేటట్లు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ఆమదాలవలస శాసనసభ్యుడు కూన రవికుమార్ తెలిపారు. గురువారం కూన రవికుమార్ స్వగృహంలో ఆమదాలవలస నియోజకవర్గ మీసేవ కేంద్ర నిర్వాహకులు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పనిచేసే మీ సేవ కేంద్రాలు వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల మూతపడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ఎప్పటికప్పుడే మీ సేవ కేంద్రాల్లో సర్వీసులు తగ్గిస్తూ మీ సేవలు మనుగలకు ప్రశ్నార్థంగా పనిచేశాయని ఆరోపించారు. వీటిపై ప్రస్తుత కూటమీ ప్రభుత్వం శాఖపరమైన చర్యలు తీసుకొని మీసేవ కేంద్రాలకు పూర్వ వైభవం తీసుకురావాలని ఆ వినతిలో కోరారు. వినతి పత్రం అందించిన వారిలో అన్నెపు రమణమూర్తి, మొదలవలస సురేష్, బూర్జ మండల మీసేవ కేంద్రం ఆపరేటర్ పప్పల హరినాధరావు, సనపల హరి ప్రతాప్, బొడ్డేపల్లి అప్పలనాయుడు, అన్నెపు రమేష్‌తో పాటు మరికొందరు పాల్గొన్నారు.

# ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తాం

*** నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి**
*** వంశధార కాలువ ఆధునీకరణ పనుల పరిశీలన**

**జలుమూరు, జూన్ 27 (వార్త):** నియోజకవర్గంలో ప్రతి ఎకరాలకు సాగునీరు అందిస్తామని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. గురువారం పెద్దదుగాం వద్ద వంశధార ఎడమ కాలువ ఆధునీకరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా మొట్ట మొదటిసరిగా వ్యవసాయానికి పెద్దపీట వేస్తున్నామన్నారు. ప్రతిరైతు కళ్లలో ఆనందం చూడాలంటే కాలువ ఆయకట్టు పరిధిలో సాగునీరు అందించాల్సివుందన్నారు. కాలువలో పూడికతీత పనులు వేగంగా జరుగుతోందని చెప్పారు. గత ప్రభుత్వంలో వంశధార కాలువలు గడిచిన ఐదు సంవత్సరాలు గాలికి విడిచిపెట్టేశారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇరిగేషన్‌కు ప్రాధాన్యమిస్తోందన్నారు. ఆయన వెంట వంశధార డీఈ శ్రీహరి, సురేష్, మండల పార్టీ అధ్యక్షుడు వెలమల రాజేంద్ర నాయుడు, బగ్గు గోవిందరావు, గుండ మన్మధ రావు గారు, దుంగ స్వామి తదితరులు పాల్గొన్నారు.





## టెన్త్ మెరిట్ విద్యార్థులకు అవార్డులు

**సంతబొమ్మాళి, జూన్27 (వార్త):** సంతబొమ్మాళి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గత ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షలలో మెరిట్ మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు నగదు ప్రోత్సాహం అవార్డులు గురువారం అందించారు. 2022-2023విద్యా సంవత్సరంలో పాఠశాల టాపర్స్‌గా నిలిచిన సూరిశెట్టి ఉషశ్రీ రూ.4వేలు అందించగా, రెండో స్థానంలో నిలిచిన దూబ రోజా, ముద్దాడ సాయిలకు చెరో 3వేలు చొప్పున అందించారు. ఏటా ఈ పాఠశాలలో టెన్త్ టాపర్స్‌కు ఇదే గ్రామానికి చెందిన డాక్టర్ డబ్బీరు వెంకటరత్నం రూ.10 వేలు ప్రోత్సాహక బహుమతిగా అందిస్తున్నారు. ఈ మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. కామరాజు విద్యార్థులకు వారి తల్లిదండ్రులు సమక్షంలో నగదు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## రేపు పాలేశ్వర స్వామికి సహస్ర ఘటాభిషేకం

**సంతబొమ్మాళి, జూన్27 (వార్త):** సంతబొమ్మాళి ఉమా పాలేశ్వర స్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి సహస్ర ఘటాభిషేకం నిర్వహిస్తునట్లు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏటా వరుణ దేవుని కృప కోసం గ్రామస్తులు, యువకులు, రైతులు సంఘటితంగా ఈ అభిషేకం నిర్వహిస్తుంటారు. శనివారం ఉదయం విఘ్నేశ్వర స్వామి పూజతో ఆరంభమై 1,108 బిందెలతో పాలేశ్వరుని అభిషేకం చేస్తారు. ఈ పాలేశ్వరుని స్వామి అభిషేకం చేశాక వానలు కురవడం ఆనవాయితీగా వస్తుందని ఇక్కడ ప్రజలు నమ్మకం. సహస్ర ఘటాభిషేకంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

## మఖరజోలలో పరిమళించిన ఆధ్యాత్మికత



**మందస, జూన్ 27(వార్త):** మఖరజోల గ్రామంలో గురువారం ఆధ్యాత్మిక పరిమళించింది. ఆధ్యాత్మికవేత్తలు, కవులు, రచయితలు ప్రసంగాలు ఆకట్టుకున్నాయి. జనజాగృతి సంస్కృతి సంస్థ ఆధ్వర్యంలో పైల మల్లేశంమాష్టారు రచించిన శ్రీభవానీ త్రిశతి అనే పుస్తకాన్ని శ్రీరామలింగేశ్వర ఆలయం వద్ద అమ్మభవానీకి అంకితమిచ్చారు. లయన్ తెప్పల కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ద్విభాషా పండితుడు సత్యన్నారాయణమూర్తి, పైడి హరనాథ్, బమ్మిడి సుబ్బారావు మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి పుస్తకాలు ఎంతో దోహదపడతాయన్నారు. యువతను సన్మార్గంలో నడిపించడానికి గ్రంథాలు అవసరమన్నారు. చిరిగిన చొక్కా తొడుక్కో కానీ, ఓ మంచి పుస్తకాన్ని కొనుక్కో అనే సామెతను గుర్తు చేశారు. ఆధ్మాత్మిక గ్రంథాలు మానవుల జీవితాన్ని సన్మార్గంలో నడిపిస్తాయన్నారు. రచయితలకు ప్రోత్సాహం లభిస్తే మంచి పుస్తకాలు, గ్రంథాలు వెలుగు చూస్తాయన్నారు. ఆధునిక సమాజంలో వింత పోకడలు వస్తున్న తరుణంలో ఇటువంటి గ్రంథాలు ఎంతో అవసరమన్నారు. అనంతరం గ్లోబల్ ఐకాన్ అవార్డు గ్రహీత కుమారి ఎం.సుధీష్ణ శాస్త్రీయ నృత్యం, మడ్డు తిరుపతిరావు, ఉలాల నందు మేధా సంపత్తి ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకున్నాయి. బాలభాగవతులతో విష్ణు సహస్ర నామ పారాయణం భక్తి, శ్రద్ధలతో జరిగింది. కార్యక్రమంలో డాక్టర్ పైల మురళీ, నేతాజీ, వెంకటాచలం, గుంట చక్రపాణి, కోర్ల కన్నారావు, బమ్మిడి కర్రయ్య, శ్రీనివాసబాబి, హేమారావుచౌదరి, వాయలపల్లి శివాజీ, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

## 1900 లీటర్ల బెల్లం ఊటలు ధ్వంసం

**మందస, జూన్27 (వార్త):** నాటుసారా స్థావరాలపై స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో సోంపేట సీఐ రేబాక జైభీం ఆధ్వర్యంలో నాటుసారా తయారీ కేంద్రాలపై గురువారం దాడులు నిర్వహించారు. మందస మండలంలోని కొండలోగాం పంచాయతీ పరిధిలో గల పట్టులోగాం ప్రాంతంలో నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన 1900 లీటర్ల బెల్లం ఊటలను ధ్వంసం చేశారు. భూమిలో పాతిపెట్టిన ప్లాస్టిక్ డ్రమ్ములను కూడా గుర్తించి, వాటిని బయటకు తీసి, స్వాధీనం చేసుకున్నారు. 40 లీటర్ల నాటుసారాను కూడా స్వాధీనం చేసుకున్నట్టు సీఐ జైభీం చెప్పారు. నాటుసారా బట్టీలు ఎవరు నిర్వహిస్తున్నారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామన్నారు. వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ సీఐ రామచంద్రకుమార్, సిబ్బంది కాంతారావు, భీమారావు, మోహన్ పాల్గొన్నారు.



# గ్యాస్ వినియోగదారులకు ఈకేవైసీ తప్పనిసరి

**ఇచ్ఛాపురం, జూన్ 27 (వార్త):** గ్యాస్ వినియోగదారులు భారత ప్రభుత్వ సూచనల మేరకు ఈకేవైసీని పొందాలని ఇచ్ఛాపురంలోని స్.వి.ఎస్.బి ఇండెన్ గ్యాస్ఏజెన్సీ ప్రతినిధి వజ్రపు వెంకటేష్ తెలిపారు. గ్యాస్ ఏజెన్సి ఎల్పిజి గ్యాస్ నియోగ దారులు అందరూ ముఖ గుర్తింపు లేదా వేలిముద్ర స్కానర్ ద్వారా ఈకేవైసీ పొందాలని వివరించారు. గ్యాస్ నియోగదారులందరూ గ్యాస్ డెలివరీ చేసే వారి వద్ద కూడా ఈకేవైసీ చేయించుకోవచ్చునని వివరించారు. ఇచ్ఛాపురం పట్టణంలోఉన్న గ్యాస్ ఆఫీసులో గ్యాస్ బుక్ ఆధార్ కార్డుతో వినియోగదారుడు వచ్చి ఈకే వేసి పొందవచ్చునన్నారు. ఇండెన్ గ్యాస్ నియోగదారులందరూ సహకరించాలని మీ మొబైల్



ఫోన్లో అందుకున్న ఓటీపీని అందించడం ద్వారా భద్రత తనిఖీని పొందాలని తెలిపారు. భద్రతా తనిఖీకి ఎటువంటి చెల్లింపులు అవసరం లేదన్నారు. గడువు ముగిసిన పాడైపోయిన సురక్ష గ్యాస్ ట్యూబుల విషయంలో నూతన సురక్షట్యూబులు గ్యాస్ డెలివరీ వ్యక్తుల వద్ద గ్యాస్ మెకానికుల వద్ద కూడా అందుబాటులో ఉంటాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉచిత సిలిండర్ల అర్హతను పొందటానికి కూడా ఈకేవైసీ ఉపయోగపడుతుందన్నారు. గ్యాస్ వినియోగదారులు అందరూ గ్యాస్ ఆఫీసుకి గాని మీ ఇంటి వద్దకు వచ్చి గ్యాస్ డెలివరీ చేసే వారి వద్ద గాని ఈకేవైసీని తప్పనిసరిగా చేయించుకోవాలని కోరారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

శ్రీకాకుళం



# గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

హిరమండలం, జూన్ 27 (వార్త): స్థానిక సబ్‌స్టేషన్‌లో వీసీబీ మరమ్మతుల్లో భాగంగా మండలంలోని అన్ని గ్రామాలకు శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల నుండి సాయంత్రం ఆరు గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, దీన్ని ప్రజలు గమనించి సహకరించాలని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.శంకరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## అభిమానికి అండగా...

### మిల్లర్ ప్రమాదంలో మహిళకు గాయాలు
### ఆస్పత్రికి వెళ్లి పరామర్శించిన టీడీపీ నేత వెంకన్న చౌదరి
### ఆరోగ్య పరిస్థితిపై ఆరా



పలాస, జూన్ 27 (వార్త): ఆమెది కొండంత అభిమానం. మహిళా నేత గౌతు శిరీష విజయం సాధించాలని బలంగా ఆకాంక్షించారు. ఎమ్మెల్యేగా విజయం సాధించాక సింహాద్రప్పన్నకు తలనీలాలు కూడా సమర్పించిందామె. ఆమె అభిమానానికి అంతా మంత్రముగ్దలయ్యారు. వివరాల్లోకి వెళ్తే.. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని తాళ్లభద్ర గ్రామానికి చెందిన వంకల లక్ష్మి దినసరి కూలి. ఆమె పని చేసే చోట ప్రమాదవశాత్తు మిల్లర్‌లో పడిపోయింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడింది. ఆమెను హుటాహుటిన స్థానిక కిడ్నీ ఆస్పత్రికి తరలించారు. ప్రమాద వార్త తెలుసుకున్న ఎమ్మెల్యే భర్త, టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఆస్పత్రికి వెళ్లి ఆ కుటుంబానికి అండగా నిలిచారు. ఆమె ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. బాధితురాలి భర్త అప్పారావును కలసి ధైర్యం చెప్పారు. ప్రమాద విషయం తెలుసుకున్న స్థానిక టీడీపీ నాయకులు తమను సహకరించినట్టు అప్పారావు చెప్పారు. ప్రస్తుతం క్షతగాత్రురాలు కోలుకోవడం ఆనందంగా ఉందని వెంకన్న చౌదరి చెప్పారు. ఆ కుటుంబానికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని స్పష్టం చేశారు. అభిమానులకు అండగా నిలిచేందుకు అన్ని వేళలా సిద్ధంగా ఉంటామన్నారు.

## తాగునీటి సరఫరాకు చర్యలు

**హిరమండలం, జూన్ 27 (వార్త):** రక్షిత మంచినీటి పథకం నుంచి తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకున్నట్లు పంచాయతీ ఎగ్జిక్యూటివ్ అధికారి యడ్ల శ్రీరామచంద్రమూర్తి అన్నారు. గురువారం మండలంలో హిరమండలం మేజర్ పంచాయతీకు సంబంధించిన రక్షిత మంచినీటి పథకానికి సంబంధించిన వాటర్ షెడ్‌ను ఆర్‌డబ్ల్యూఎస్,విద్యుత్ శాఖ సిబ్బందితో పరిశీలించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఇటీవల తాగునీటికి ఇబ్బందులు పడుతున్న నేపధ్యంలో తాగునీటి సరఫరా మరమ్మత్తులు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఎలాంటి ఇబ్బందులున్నా తక్షణమే చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. అనంతరం మేజర్‌పంచాయతీ పరిధిలో మంచినీటి బావుల్లో క్లోరినేషన్ చేపట్టారు. ఈయనతో పాటు ఆర్‌డబ్ల్యూఎస్ జెఈఈ సాగర్, ఇతర సిబ్బంది ఉన్నారు.





## పాతపట్నం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

### ఉక్కు శాఖ సహాయమంత్రిని కలసిన సిరిపురం

**హిరమండలం, జూన్ 27 (వార్త):** రాష్ట్రంలో వెనుకబడిన పాతపట్నం నియోజకవర్గం వెనుకబడివుందని, చిన్న చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసి అభివృద్ధికి కృషి చేయాలని ఉక్కు శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మకు పాతపట్నం నియోజకవర్గ బీజేపి సీనియర్ నాయకులు, విద్యావేత్త సిరిపురం తేజేశ్వరరావు కోరారు. ఈ మేరకు గురువారం ఉక్కు శాఖ సహాయమంత్రిని సిరిపురం మర్యాదపూర్వకంగా కలిసారు.

## లీజు గడువు ముగిసిన మున్సిపల్ షాపులు సీజ్



ఇచ్ఛాపురం, జూన్ 27 (వార్త): మున్సిపాలిటీ పరిధిలో 25 ఏళ్ల లీజు గడువు ముగిసిన షాపులను మున్సిపల్ అధికారులు గురువారం సీజ్ చేసారు. హాస్పిటల్ రోడ్‌లో నాలుగు షాపులను అలాగే పాత పంచాయతీ కార్యాలయం వద్ద గల ఆరు షాపులకు సీల్ వేశారు. మొండి బకాయిలతో పాటు 25 ఏళ్ల లీజు గడువు ముగిసిన షాపులను సీజ్ చేశారు.

ఈ నేపథ్యంలో మృతి చెందిన లీజుదారుల షాపులను కూడా సీజ్ చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. అలాగే బాధితులందరూ ఎమ్మెల్యే అశోక్‌బాబు దృష్టికి విషయాన్ని తీసుకువెళ్లారు.

# నిమ్మక జయకృష్ణ విజయోత్సవ యాత్ర







సీతంపేట, జూన్ 27 (వార్త): పాలకొండ నియోజకవర్గం ఉమ్మడి జనసేన పార్టీ శాసన సభ్యుడు నిమ్మక జయకృష్ణ విజయోత్సవ యాత్ర ను విజయవంతం చేసిన జనసైనికులకు, వీరమహిళలకు, టీడీపీ, బీజేపీ కుటుంబ సభ్యులకు అభినందనలు తెలిపారు. ప్రజలందరికీ తాను ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ, పాలకొండ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఇంతటి అభిమానాన్ని అందించిన ప్రజలందరికీ ఈ సందర్భంగా ధన్యవాదాలు చెప్పారు. పార్వతీపురం నుంచి పాలకొండ వరకు ఈ విజయోత్సవ యాత్ర సాగింది. రోడ్డు మార్గంలో అడుగడుగునా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. తనకు మంగళ హారతులు, పూలదండలతో ఆహ్వానం పలుకుతున్న ప్రజలకు తాను రుణపడి ఉంటానని ఎమ్మెల్యే అన్నారు. వందలాది వాహనాలతో కొనసాగుతున్న విజయోత్సవ యాత్రలో పాల్గొన్న నాలుగు మండలాల ఉమ్మడి పార్టీల నాయకులు, కార్యకర్తలకు, అభిమానులకు ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. (ఫోటో : 8, 9 ,10, 14)

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# జీడిపంట గిట్టుబాటు ధరకు ఉద్యమాలు

**నాటి పీపుల్స్ వార్, నేటి ప్రజా సంఘాలు**
**నాటి మాజీ ఎమ్మెల్యే శివాజీ.. నేటి ఎమ్మెల్యే గౌతు శిరీష వరకు**
**సాగిన పోరుకు నేటి వినతులకు తోడు..**
**దశాబ్దాలు జీడి రైతుకు న్యాయం జరిగేనా...?**





పలాస, జూన్ 27 (వార్త): ఉద్దాన ప్రాంతానికి ప్రధాన జీవనాధారంగా పండించి జీడి పంటకు మద్ధతు ధరకు దశాబ్దాల నుంచి ఉద్యమాలు చేపడుతూనే ఉన్నారు. పీపుల్స్ వార్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ పోరాటంలో నిరసనలు, అరెస్టులను నేటికీ రైతులు కథలు కథలుగా చెప్పుకుంటున్నారు. ఆనాటి ఎమ్మెల్యే గౌతు శివాజీ నుంచి రైతుల న్యాయానికి పోరాటం చేసారు. అలాగే ప్రస్తుత ఎమ్మెల్యే గౌతు శిరీషకు గురువారం రైతు సంఘాలు కలిసాయి. అయితే నాటి పీపుల్స్ ఉద్యమంలో ఇటు ప్రభుత్వానికి అటు పలాస జీడి పిక్కల వ్యాపారులకు ఎన్నో వినతిపత్రాలు గిట్టుబాటు ధర కల్పించాలని పాలకులకు అందజేసినప్పటికీ స్పందించిన దాఖలాలు లేవు. దీంతో పీపుల్స్‌వార్ పార్టీ పలాసలోని జీడిపప్పు వ్యాపారస్తులకు చెందిన ఓ సినిమా హాలుతో పాటు అప్పుడు కాంగ్రెస్ నేతకు చెందిన సాల్ట్ ఫ్యాక్టరీ లాంటివి పీపుల్స్ వారి పార్టీ ఆధ్వర్యంలో జరిగిన నిరసనలో ధ్వంసమయ్యాయని ఆనాటి ఉద్యమకారులు కొందరు తెలిపారు. ఇన్ని నిరసనలు చేపట్టినా అటు ప్రభుత్వం గానీ, ఇటు పలాస జీడి వ్యాపారస్తులు గాని స్పందించక పోవడంతో పీపుల్స్ వార్ పార్టీ ఆధ్వర్యంలో పలాస జీడి వ్యాపారస్తుల సంఘం నేతలను కొందరిని ఉద్దానని పిలిపించి జీడి గిట్టుబాటు ధరపై అంగీకారినికి వచ్చినట్టు సమాచారం. నాటి నుంచి ప్రతి గ్రామానికి జీడి వర్తకులు వెళ్లి రైతుల వద్ద పిక్కలను కొనుగోలు చేసారు. దీంతో నేటి వరకు విప్లవ ప్రజా సంఘాలతో పాటు, వామపక్ష పార్టీలు కూడా జీడిపంట గిట్టుబాటు ధర కల్పించేందుకు రైతులకు న్యాయం చేపట్టేలా నిత్యం పోరాటం చేస్తూనే ఉన్నారు. గత ప్రభుత్వంలో మంత్రి సీదిరి అప్పలరాజు, వ్యాపారస్తులు, రైతుల మధ్య సమన్వయం నెరపి 80 కేజీల జీడిపప్పు బస్తా రూ.తొమ్మిది వేలకు కొనుగోలు చేయాలనే ఒప్పందం కుదుర్చుకుంటే ప్రభుత్వం రైతు ఖాతాలో రూ.వెయ్యి జమ చేస్తామని చెప్పారని రైతు సంఘాలు గుర్తు చేసాయి.

ప్రస్తుతం ఎన్నికల ముందు యువగళం సభకు పలాస వచ్చిన టీడీపీ జాతీయ నాయకుడు నారా లోకేష్‌ను తాము కలిసి జీడి పంటకు మద్దతు ధర కల్పించాలని వినతి పత్రం అందజేశారు. అలాగే ఎన్నికల ప్రచారానికి వచ్చిన నారా చంద్రబాబు నాయుడుకు కూడా వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే గౌత శిరీషకు సాధన కమిటీ గురువారం వినతిపత్రం అందజేసింది. జీడి రైతులకు న్యాయం జరగాలని ప్రాంతీయ సాధన కమిటీ కోరింది.

# రిజర్వేషన్ల రక్షణకై జూలై 1న మహాధర్నా

శ్రీకాకుళం టౌన్ జూన్ 27, (వార్త): శ్రీకాకుళం నగరంలో ముచ్చవాని పేట అంబేద్కర్ విగ్రహం వద్ద మహాధర్నా కరపత్రాలు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చైర్ సాధన సమితి కన్వీనర్ టొంపల రమణ, సామాజిక న్యాయ పోరాట సమితి జిల్లా ప్రధాన దుర్గాసి గణేష్, కులనిర్మూలన పోరాట సమితి జిల్లా నాయకులు రాకోటి రాంబాబు మాట్లాడుతూ అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో హనుమంతు లజపతిరాయి నుండి నేటి నిమ్మ వెంకట్రావు వరకు జరిగిన నియామకాలు నిధుల దుర్వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో మచ్చుకైనా రిజర్వేషన్లను పాటించకపోవడం వల్ల ఎస్సీ ఎస్టీలు యువత ఈ 28 సంవత్సరాలుగా చాలా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ శ్రీకాకుళం అంబేద్కర్ విశ్వవిద్యాలయంపై దృష్టి కేంద్రీకరించాలని వారు కోరారు. ఎస్సీ ఎస్టీ మహిళ, వికలాంగుల, మైనార్టీ రిజర్వేషన్ల రక్షణకై జూలై 1న జరుగు మహా ధర్నా కార్యక్రమం జయప్రదం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముచ్చ మహేష్, బిల్లాడ గోపి, ముచ్చా శ్యాంసుందర్, బొచ్చ గణేష్, కల్లేపల్లి మోహన్, చిట్టిబారికి బంగారం, చవితి యశ్వంత్, ఆకుల శంకర్, బొచ్చ రవికుమార్, బొచ్చ వేణుగోపాలరావు, చల్ల రాజు తదితరులు పాల్గొన్నారు.




# ఉద్దానాన్ని ఆదుకోండి..

## వలసలు లేకుండా చూడాలి.. ఉద్దానం కూటమి కమిటీ..

పలాస, జూన్ 27 (వార్త): దశాబ్దాలుగా ఉద్దాన ప్రాంత ప్రజలకు ఇక్కడ ఉపాధి లేకపోవడంతో వలసలు భారీగా పెరిగిపోతున్నాయని, వీటిని నివారించి ఉద్దాన ప్రజలను కాపాడాలని రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను ఉద్దాన కూటమి నేతలు కోరారు. స్థానికంగా గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు పలాస వచ్చిన సందర్భంలో తెలుదేశం అధికారంలోకి వచ్చిన వెంటనే జీడి రైతులకు సరైన గిట్టుబాటు ధర కల్పిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారన్నారు. దీనిపై మీరు చొరవ తీసుకొని జీడి పంటకు సరైన గిట్టుబాటు ధర కల్పించి జీడి రైతులను ఆదుకొని వలసలు నివారించాలని కోరారు.

డిమాండ్‌లు:

1. ప్రభుత్వం జీడిపిక్కలు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 80 కేజీల బస్తా రూ.16 వేలకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. 2. జీడి కొబ్బరి పంటలకు బోర్డులను ఏర్పాటు చేయాలి. 3. వంశధార కాలువ ఉద్దాన గ్రామాల కలుపుతూ ఇచ్ఛాపురం వరకు పొడిగించాలి. 4. రైతులు తీసుకున్న అన్ని రకాల రుణాలను మాఫీ చేసి కొత్త రుణాలు మంజూరు చేయాలి. 5. తిత్లి తుపానులో నష్టపోయిన ఏడు వేల మంది రైతులకు నష్టపరిహారం చెల్లించాలి. 6. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ పంటలకు అనుసంధానం చేయాలి.

# రాష్ట్రస్థాయి ఉషూ పోటీల్లో సత్తాచాటాలి

**- జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ముఖ్య సలహాదారు పి.సుందర్రావు మాస్టారు**

శ్రీకాకుళం టౌన్, జూన్ 27 (వార్త): రాజమండ్రిలో ఈనెల 28న నిర్వహించే 10వ జూనియర్ రాష్ట్రస్థాయి ఉషూ పోటీలకు శ్రీకాకుళం జిల్లా ఉషూ అసోసియేషన్ తరఫున ఏడుగురు క్రీడాకారులు ఎంపికైనట్లు జిల్లా ఉషూ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రెడ్డి శివకుమార్ తెలిపారు. ఈ మేరకు శ్రీకాకుళంలోని పురుషుల డిగ్రీ కళాశాల ప్రాంగణంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్, జిల్లా క్రీడా ప్రాధికారి సంస్థ డీఎస్డివో ఆధ్వర్యంలో క్రీడాకారులు గురువారం పయనమయ్యారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ముఖ్య సలహాదారు పి.సుందర్రావు మాస్టారు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి, జాతీయస్థాయిలో జిల్లా ఉషూ క్రీడాకారులకు మంచి గుర్తింపు ఉందని, 28న నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి జిల్లాకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావలని ఆకాంక్షించారు. జిల్లా ఒలింపిక్ ప్రధాన కార్యదర్శి మెంటాడ సాంబమూర్తి మాట్లాడుతూ నిరంతరం శిక్షణ పొందుతున్న ఉషూ క్రీడాకారులకు అభినందనలు తెలిపి, రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయకేతనం ఎగురవేయాలని ఆకాంక్షించారు. శ్రీకాకుళం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ డీఎస్డీవో కె.శ్రీధర్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో శ్రీకాకుళం జిల్లాకు ఉషూ క్రీడల్లో మంచి గుర్తింపు ఉందని, నిరంతర సాధనతో క్రీడాకారులు ఉన్నత స్థాయిలో ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తైక్వాండో అసోసియేషన్ శ్రీకాకుళం జిల్లా ప్రధాన కార్యదర్శి కొమర భాస్కరరావు, కురిటి తారకరామా, రెడ్డి సాయిరాం, కె.మోహనకృష్ణ, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ విభాగంలోని రాష్ట్ర స్థాయి పోటిల్లో పాల్గొననున్నవారు వీరే :

పురుషుల విభాగంలో అండర్ 45 కిలోల విభాగంలో టి.ఢిల్లేశ్వర రావు, అండర్ 48 కిలోల విభాగంలో ఎ.దేవిప్రసాద్, అండర్ 52 కిలోల విభాగంలో టి.ఎర్రంరాజు, అండర్ 56 కిలోల విభాగంలో జి .హిమచందన్, అండర్ 65 కిలోల విభాగంలో మణికంఠ ఉన్నారు. అలాగే మహిళా విభాగంలో అండర్ 45 కిలోలులో టి.ఝాన్సీ, రుప్ప తన్మయి ఉన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించండి

ఇచ్ఛాపురం, జూన్ 27 (వార్త) : పారిశుధ్యం నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ పీఎల్ ప్రసాద్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పారిశుధ్యం పై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ సహాయకులు, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సంబంధిత మండల స్థాయి అధికారులతో చర్చించారు. ఈ నెల డయేరియా అవగాహన వారోత్సవాలు ఉండడంతోపాటు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఈఈ విష్ణుమూర్తి, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, పీవో నాగరాణి, మెడికల్ ఆఫీసర్‌లు కల్యాణి, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.



# జీడిపంటకు మద్దతు ధర కల్పించాలి

## ఉద్దాన సమస్యల సాధన కమిటీ ఎమ్మెల్యే శిరీషకు వినతి

పలాస, జూన్ 27 (వార్త): ఉద్దాన ప్రాంత జీడి రైతులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరుతూ ఉద్దాన ప్రాంత సమస్యల సాధన కమిటీ ఎమ్మెల్యే గౌతు శిరీషకు గురువారం వినతిపత్రం అందజేశారు. ప్రధానంగా ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాల ద్వారా జీడిపిక్కలను కొనుగోలు చేయాలని, 80 కేజీలు బస్తా రూ.16 వేలు మద్దతు ధర కల్పించాలని సంఘ నాయకులు ఆమెకు విన్నవించుకున్నారు. శ్రీకాకుళం జిల్లాలో 30 మండలాల్లో సుమారుగా 50వేల హెక్టార్లు జీడి పంటను సాగుజేస్తున్నారని, ముఖ్యంగా ఉద్దాన తీర ప్రాంతంలో ప్రధాన జీవనాధారమైన జీడి పంటపై ప్రత్యక్షంగా, పరోక్షంగా కొన్ని లక్షల కుటుంబాల ఆధారపడి జీవిస్తున్నాయని, వేలాది మంది కుటుంబాలకు ఏకైక జీవనాధారమైన జీడి పంటకు సరైన గిట్టుబాటు ధరను ప్రకటించి ప్రజలను ఆదుకోవాలన్నారు. గత నాలుగు దశాబ్దాలుగా అనేక ఉద్యమాలు చేసినప్పటికీ ఎటువంటి ఫలితం లభించలేదని, గతంలో సంభవించిన తిత్లీ తుపాను ముందు 80 కేజీలు జీడిపిక్కల బస్తా రూ.14 వేలకు కొనుగోలు చేసిన జీడి వర్తకులు, విదేశీ పిక్కలు కారు చౌకగా లభించడంతో 80 కేజీల బస్తా రూ.ఎనిమిది వేలు కంటే ఎక్కువ ధరకు కొనుగోలు చేయడం లేదని గత ఐదేళ్లుగా ఇదే పద్ధతి కొనసాగుతోందని రైతులు వాపోతున్నారన్నారు. గతంలో తిత్లి తుపాను మూలంగా జీడి పంట పూర్తిగా నాశనమై పంట దిగుబడి పూర్తిగా తగ్గిపోవడంతో జీడిపంటకు రేటు పడిపోవడం గోరుచుట్టుపై రోకలి పోటుల తయారైందని, తద్వారా జీడి వర్తకులు దయాదాక్షిన్యాలపై ఆధారపడి విక్రయించాల్సిన దుస్థితి ఏర్పడిందని తెలిపారు. ఈ విషయమై గత ప్రభుత్వానికి అనేకసార్లు విన్నవించుకున్నా ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. ఈ ప్రభుత్వమైనా రైతుల గోడు ఆలకించి న్యాయం చేయాలని కోరారు. గతంలో మంత్రి సీదిరి అప్పలరాజు, కలెక్టర్ ఓ సమావేశంలో 80 కేజీల జీడి బస్తా వర్తకులు రూ. తొమ్మిది వేలకు కొనుగోలు చేస్తే ప్రభుత్వం నుండి రూ.వెయ్యి రైతుల ఖాతాలో జమ చేస్తామని హామీ ఇచ్చారని, కాని అది అమలుకు నోచుకోలేదని గుర్తు చేశారు.



ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం ఇచ్చిన వారిలో నేతలు దాసరి శ్రీరాములు, గొర్లె చలపతి, రాజాము గుణవంతు, తమాడ త్రిలోచనరావు, మాజీ సర్పంచ్ మామిడి మాధవరావు పుచ్చ దుర్యోధన, మాకనపల్లి మాజీ సర్పంచ్ కుత్తుము మాధవరావుతో పాటు కూటమి నేతలు కిక్కర ఢిల్లీరావు, తమాడ అప్పారావు, గర్తము తులసిరావు తదితరులు ఉన్నారు.

# సాగునీరు అందించేందుకు వివరాలివ్వాలి

## ఎమ్మెల్యే గౌతు శిరీష



నీటి పారుదల సమీక్షలో మాట్లాడుతున్న గౌతు

పలాస, జూన్ 27 (వార్త): పలాస నియోజకవర్గంలోని రైతులకు సాగునీరు అందించేందుకు వీలుగా ముందుస్తూ ప్రణాళికలతో రైతులకు న్యాయం జరిగేలా స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష చర్యలు చేపట్టారు. అందులో భాగంగా పలాసలో ని తన కార్యాలయంలో నీటిపారుదల శాఖ అధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా కళింగల్, డాబర్‌సింగ్, దామోదర్ సాగర్, వరహాలు గెడ్డతో పాటు బెల్లుపాటియా, కలిగింది షట్టర్లు, సంకుజోడు, సునాముది గెడ్డ లాంటి సాగునీటి వనరుల వివరాలివ్వాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. ఖరీఫ్ సీజన్లో రైతులకు సాగునీరందించేందుకు వీలుగా అన్ని చర్యలు ముందస్తుగానే తనకు తెలియజేయాలన్నారు. అధికారులు ఇచ్చిన నివేదిక ప్రకారం రైతులకు సాగునీరు అందించేందుకు వీలవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ అధికారితో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# సగటు వేతనం రూ.295 లక్ష్యంగా పనులు

## డ్వామా పీడీ జీవీ చిట్టి రాజు



జలుమూరు, జూన్ 27 (వార్త) : జిల్లావ్యాప్తంగా ఉపాధి హామీ పథకం సిబ్బంది రూ. 295 సగటు వేతనం సాధించే దిశగా విధులు నిర్వహించాలని అందుకు అవసరమైన పనులను చేపట్టాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జీవీ చిట్టిరాజు ఆదేశించారు. జలుమూరు మండల పరిషత్ కార్యాలయంలో జలుమూరు, సారవకోట మండలా లకు చెందిన ఉపాధి హామీ పథకం సిబ్బందితో పనుల ప్రగతిపై గురువారం సమీక్ష సమావేశాన్ని నిర్వహి ంచారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. అన్ని మండలాలకు నిర్దేశించిన టార్గెట్ల మేరకు కూలీలకు పని దినాలను కల్పించాలన్నారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో చల్లని వేళల్లో మాత్రమే పనులు చేసే విధంగా క్షేత్రస్థాయి సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. వేతనదారులకు గరిష్ట వేతనం అందేలా సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులు, ఈసీ సాంకేతిక పరమైన సలహాలివ్వా లన్నారు. కొలతల మేరకు పనులు చేయించడం వలన గరిష్ట వేతనం కూలీలకు అందుతుందని పీడీ అభిప్రాయపడ్డారు. ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు నూటికి నూరు శాతం ఉపాధిని చూపించాలన్నారు. పంచాయతీ స్థాయిలో రికార్డులను ఎప్పటికప్పుడు అప్డేట్ చేయించాలని, అలాగే పని ప్రదేశాలలో పూర్తి వివరాలతో కూడిన బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. మండలాల్లో అవసరం మేరకు పనులను గుర్తించి తక్షణమే ప్రణాళికలను తయారు చేసి జిల్లా కార్యాలయానికి పంపించా లన్నారు. ప్లాంటేషన్ పనులకు సంబంధించి కూడా తక్షణమే ప్రణాళికలను తయారు చేయాలని ఆదేశించారు. రైతులకు మునగ సాగుపై అవగాహన కల్పించాలని, టార్గెట్ల మేరకు మునగ ప్లాంటేషనుకు చర్యలు తీసుకోవాలన్నారు. పూడికతీత పనులకు ప్రత్యామ్నాయంగా ఇతర పనులను గుర్తించి అంచనాలు తయారు చేయాలని, ఉపాధి పనులలో జిల్లాను మోడల్ జిల్లాగా తయారు చేసేలా సిబ్బంది పరస్పరం సహకరించుకొని ప్రగతిని సాధించాలని కోరారు. ఈ సమావేశంలో ఏపీడీ మురళీకృష్ణ రెండు మండలాలకు చెందిన ఏపీవోలు, ఈసీలు, టీఏలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే జయకృష్ణకు జన నీరాజనం



వీరఘట్టం, జూన్ 27 (వార్త): పాలకొండ నియోజకవర్గం ఎమ్మెల్యేగా అఖండ విజయం సాధించి అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం తొలిసారిగా గురువారం తన స్వస్థలానికి చేరుకున్న ఎమ్మెల్యే జయకృష్ణకు ప్రజలు, అభిమానులు, కార్యకర్తలు, నాయకులు నీరాజనాలందించారు. జిల్లా కేంద్రం పార్వతీపురం చేరుకున్న ఆయనకు వందలాది కార్లతో స్వాగతం పలికారు. పార్వతీపురం మీదుగా వీరఘట్టం చేరుకొని ఎమ్మెల్యే ప్రజల నుంచి అభినందనలు స్వీకరించారు. దారి పొడవునా అభిమానులు తమ కాన్వాయను నిలిపివేస్తూ పుష్పగుచ్ఛాలు, పూలదండలు వేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఎవరికి ఎక్కడా లేనంతగా జనాలు స్వచ్ఛందంగా తరలిరావడంతో రహదారులన్నీ కిక్కిరిసిపోయాయి. జయకృష్ణ కూడా కలివిడిగా సందడి చేశారు. ఈ సందర్భంగా ఆయన మండల కేంద్రం వీరఘట్టం అంబేద్కర్ జంక్షన్‌లో మాట్లాడుతూ తనను ఎమ్మెల్యేగా గెలిపించి ఎంతో బాధ్యతలను తనకు అప్పగించారని, తాను నియోజకవర్గంలోని సమస్యలన్నింటిని ప్రాధాన్యతపరంగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. 24 గంటలు తాను ప్రజలకు అందుబాటులో ఉంటానని, ప్రజా సమస్యలే తన సమస్యగా మలుచుకొని పరిష్కరిస్తానని చెప్పారు. తన ప్రసంగానికి ప్రజలు ఎంతో ఉత్సాహంగా ఉర్రూతలూగారు. ఈయన వెంట టీడీపీ సీనియర్ నాయకులు మాజీ ఏఎంసీ చైర్మన్ పొదిలాపు కృష్ణమూర్తినాయుడు, తోటపల్లి ప్రాజెక్ట్ మాజీ చైర్మన్ నిమ్మక పాండురంగ, టీడీపీ మండలాధ్యక్షుడు ఉదయాన ఉదయభాస్కర్, పట్టణ టీడీపీ అధ్యక్షుడు జామి లక్ష్మీనారాయణ, నీటి సంఘం మాజీ చైర్మన్ బళ్ల హరిబాబు, మండల తెలుగు యువత అధ్యక్షుడు మాచర్ల అనిల్‌బాబు, టీడీపీ యువ నాయకులు నత్తల అభిషేక్, పట్టణ శాఖ తెలుగు యువత అధ్యక్షుడు పప్పల మహేష్, రాజాం వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:016413